# సాక్షి పెద్దపల్లి

శనివారం। 16। సెప్టెంబర్। 2023


## రాజన్న పాహిమాం

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమతమ మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ దేవాలయాలను సందర్శించారు.



## న్యూస్‌రీల్

### 'స్వచ్ఛతా హీ సేవా'పై శ్రద్ధ చూపాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను అక్టోబర్ 2 వరకు శ్రద్ధతో నిర్వహించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. శుక్రవారం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. వీధుల్లో చెత్త కుండీలు, పబ్లిక్ టాయిలెట్లు, చెత్త సేకరణ వాహనాలు, పారిశుధ్య ఆస్తుల మరమ్మతు పెయింటింగ్ పనులు చేపట్టాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, మార్కెట్లు, పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ మిషన్ వాల్‌పెయింటింగ్ వేయించాలని, డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు, స్వశక్తి సంఘాల మహిళలకు స్వచ్ఛతపై క్విజ్‌పోటీలు, ప్లాంటేషన్ డ్రైవ్, స్వచ్ఛత ప్రతిజ్ఞ, స్వచ్ఛతరన్ నిర్వహించాలని సూచించారు. డీపీవో చంద్రమౌళి, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

### అంబేడ్కరా.. మా మొర ఆలకించండి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: అంబేడ్కరా.. మా మొర ఆలకించి న్యాయమైన సమస్యలు పరిష్కరించేలా సీఎం కేసీఆర్‌కు చెప్పాలంటూ శుక్రవారం అంగన్‌వాడీ ఉద్యోగులు పెద్దపల్లి బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఐదు రోజులుగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగినా పాలకులు పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై వేధింపులు ఆపి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కమలేషుతో పాటు నాయకులు రామలక్ష్మి, శారద, భాగ్యశ్రీ, మహేశ్వరి, లక్ష్మి, ఉమ, శోభ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

### అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నియంత్రించ వచ్చని పెద్దపల్లి ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పెట్రోల్ బంక్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. బంక్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు అవసరమైన పరికరాలు నిబంధన మేరకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, రమేశ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నెట్టింట్లో మాయగాళ్లు

- పెద్దపల్లి చీకురాయిలో నివాసం ఉండే సింగరేణి ఉద్యోగి వంశీకృష్ణ(26) గుర్తు తెలియని ఆన్‌లైన్ యాప్ నుంచి రుణం తీసుకున్నారు. సకాలంలో చెల్లించకపోవడంతో అతడి ఫొటో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేసి పరువు తీస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

- గతంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ నిర్మాణంలో పనిచేసేందుకు వచ్చిన విజయనగరానికి చెందిన సంతోష్‌కుమార్ రూ.6వేల రుణం తీసుకున్నాడు. సకాలంలో చెల్లించకపోవడంతో అతడి ఫొటోలు మార్ఫింగ్ చేసి కుటుంబసభ్యులకు పంపారు. మనస్తాపానికి గురై కుటుంబసభ్యులకు వీడియోకాల్‌లో ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



- గోదావరిఖని పవర్‌హౌస్‌కి చెందిన దాతు ప్రశాంత్(25) సింగరేణిలో ఉద్యోగం చేస్తూ తక్షణ అవసరం కోసం రూ.60వేల రుణం తీసుకున్నాడు. సకాలంలో చెల్లించకపోవడంతో అతడి వాట్సాప్ డీపీలో ఉన్న అతడి తల్లిదండ్రుల ఫొటోను మార్ఫింగ్ చేసి అసభ్యపదాలతో బంధువులకు పంపించారు. దీంతో రైలు కింద పడి అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలో ఇలా చాలామంది లోన్‌యాప్‌ల మాయమాటలు నమ్మి వారి చేతికి చిక్కి మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

- ఇన్‌స్టెంట్ రుణాల పేరుతో యువతకు వల
- గడువులోపు తీర్చకుంటే వేధింపులు
- ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టింగ్
- అవమానంతో ఉసురు తీసుకుంటున్న వైనం..
- విద్యార్థులు, ఉద్యోగులు.. ఎవరైనా చిక్కారంటే అవుట్

సాక్షి, పెద్దపల్లి: ప్రజల చిన్న చిన్న ఆర్థిక అవసరాలే ఆయుధాలుగా అప్పులిస్తూ.. తీసుకున్న వారిని నిలువు దోపిడీ చేస్తున్న రుణ యాప్‌ల ఆగడాలు ఆగటం లేదు. ఎక్కడుంటారో.. ఎలా ఉంటారో కూడా తెలియని డిజిటల్ మాయగాళ్లు మధ్యతరగతి కుటుంబాల్లో లోన్‌యాప్స్ పేరుతో శోకాన్ని మిగుల్చుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు వారి వలకు చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. డిజిటల్ అప్పుల వ్యవస్థలోని ఇబ్బందులు, అవకతవకలు అధిగమించలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. చిన్న వయస్సులోనే బలవన్మరణాలకు పాల్పడి ఇటు తల్లితండ్రులను, అటు కన్న బిడ్డలను దిక్కులేని వారిని చేస్తున్నారు. గురువారం సింగరేణి ఉద్యోగి సైతం రుణయాప్‌లో పైసలు తీసుకొని సకాలంలో తిరిగి చెల్లించకపోవడంతో రుణయాప్‌ల వారి వేధింపులు తాళలేక ప్రాణాలు తీసుకున్నారు.

**పత్రాలు లేకుండా తక్షణ రుణాలతోనే ముప్పు**

లోన్‌యాప్స్ వేధింపులు పెరగటంతో కేంద్రప్రభుత్వం ప్లేస్టోర్‌లో అటువంటి యాప్స్‌ను తొలగించింది. అలాగే పోలీసులు సైతం వాటిపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నా ఆన్‌లైన్‌లో ఎక్కువ సేపు గడిపేవారికి ఎటువంటి పత్రాలు లేకుండా తక్షణం రుణాలు ఇస్తామని లింక్‌లు, సందేశాలు పంపిస్తున్నారు డిజిటల్ మాయగాళ్లు. దీంతో తక్షణ అవసరాలకు డబ్బులు వస్తుండడంతో అత్యవసర పరిస్థితుల్లో లోన్ యాప్స్ వైపు ఆకర్షితులవుతున్నారు. చిన్న క్లిక్, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఇద్దరు ష్యూరిటీల ఫోన్ నంబర్లను తీసుకుని బ్యాంకు ఖాతాలోకి డబ్బులను పంపిస్తున్నారు. అవి కట్టలేని పరిస్థితిలో అసభ్య పదజాలంతో మాట్లాడుతూ వేధింపులు మొదలుపెడతారు. లోన్ తీసుకున్న వ్యక్తి చెల్లించని పక్షంలో ష్యూరిటీగా ఉన్నవారి సోషల్ మీడియా ఖాతాలకు, లోన్ తీసుకున్న వ్యక్తి ఫోన్‌లోని నంబర్లకు మార్ఫింగ్ ఫొటోలను పంపుతూ వేధిస్తున్నారు. మొదట లోన్ తీసుకున్న మొత్తం రూ.10వేలు అయితే అది తీరా కట్టేసరికి రూ.50వేలకు చేరుకుంటున్నది. కేవలం నెలల వ్యవధిలోనే డబుల్, త్రిబుల్ అవుతున్నాయి. వాటిని తీర్చలేక, వేధింపులు తాళలేక ప్రాణాలు తీసుకుంటున్నారు.

**ఇలా చేయాలి..**

- రుణయాప్‌ల జోలికి వెళ్లకపోవడమే మంచిది. రుణం తీసుకుంటే యాప్ వారు వేధింపులకు గురిచేస్తే వెంటనే కింది విధంగా చేయాలి
- పోలీసులకు ఫిర్యాదు చేయటం.
- నేషనల్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌ల ద్వారా.
- 1930 నెంబర్‌కు కాల్ చేయటం ద్వారా ఫిర్యాదు చేయాలి.
- బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇవ్వటం.


**లోన్ యాప్‌ల జోలికి పోవద్దు**



తక్షణ రుణాల పేరిట రుణాలు ఇచ్చే యాప్స్‌తో జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది లింక్‌లు నొక్కి నేరుగా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యాప్ వారు అడిగే ప్రశ్నలను చదవకుండా 'ఎస్' అంటూ వ్యక్తిగత, కాంటాక్టు తదితర వివరాలు వారి చేతుల్లోకి వెళ్లిపోవడంతో చిక్కుల్లో పడుతున్నారు. వాటి జోలికి పోకపోవడమే మంచిది.– వైభవ్ గైక్వాడ్, డీసీపీ

# బిల్ కలెక్టర్ల మాయాజాలం

- ఏరియర్స్ పేరుతో అధిక బిల్లుల వసూలు
- వినియోగదారులకు కుచ్చుటోపీ




ఆగస్టులో బిల్‌బుక్ నుంచి ఇచ్చిన రశీదు

ధర్మారం: విద్యుత్ వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేసే ఉద్యోగులు అధిక బిల్లులు వసూలు చేసి సంస్థకు మాత్రం తక్కువ చెల్లిస్తూ వినియోగదారులకు కుచ్చుటోపి పెడుతున్న సంఘటన ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ధర్మారం విద్యుత్ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్‌వో) పరిధిలో ధర్మారం, జూలపల్లి మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలో టీఎస్ఎన్‌పీడీసీఎల్ ద్వారా సరఫరా అవుతున్న విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రతినెలా వివిధ రకాల కనెక్షన్‌ల నుంచి దాదాపు రూ.కోటి పైగా వసూలు చేస్తుంటారు. ఇందుకు ఏడుగురు విద్యుత్ రెవెన్యూ కలెక్టర్ (ఆర్‌సీ)లు ఉంటారు. నలుగురు పర్మనెంట్ ఉద్యోగులుండగా.. మరో ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. కొంత కాలంగా కొందరు ఆర్‌సీలు బిల్‌బుక్ ద్వారా ఎక్కువగా వసూలు చేస్తూ రశీదులు ఇస్తూనే ఈఆర్‌ఓ కార్యాలయంలో తక్కువ కడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని నందిమేడారంకు చెందిన వేల్పుల రాజయ్యకు 14 జూలై నుంచి 14 ఆగస్టు వరకు ఇంటి కనెక్షన్ వాడిన విద్యుత్ బిల్లు రూ.699లు, ఏరియర్స్ మరో రూ.129లు వచ్చింది. దీంతో రాజయ్య గ్రామానికి వచ్చిన ఆర్‌సీ (బిల్‌కలెక్టర్)కు రూ.830లు చెల్లించి రశీదు తీసుకున్నారు. ఇప్పటివరకు బాగానే ఉండగా శుక్రవారం ఆగస్టు నెలకు సంబంధించి బిల్లు ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 15 వరకు తీయగా విద్యుత్ బిల్లు రూ.411, ఏరియర్స్ రూ.73లు వచ్చింది. గతనెలలో కట్టినప్పటికీ ఎరియర్స్ ఎందుకు వచ్చిందని పరిశీలించగా గతనెలలో రూ.830 రశీదు ఇచ్చినప్పటికీ అందులో నుంచి రూ.73లు ప్రభుత్వానికి చెల్లించకుండా ఆర్‌సీ ఉద్యోగి సొంతానికి వాడుకున్నాడని రాజయ్య ఆరోపించారు. ఈవిషయమై రాజయ్య కుమారుడు తిరుపతి ఈఆర్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదుపై స్పందించిన ఇన్‌చార్జి ఏఏవో శ్రీనివాస్ తమ సిబ్బంది ద్వారా గ్రామంలో విచారణ చేయించారు. ఈవిషయమై ఇన్‌చార్జి ఏఏవో శ్రీనివాస్‌ను వివరణ అడుగగా ఫిర్యాదుపై విచారణ చేయించామని నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గోదావరితీరంలో ప్రత్యేక మత్స్య అభివృద్ధి మండలి



మాట్లాడుతున్న పిట్టల రవీందర్

గోదావరిఖని: గోదావరితీరంలో ప్రత్యేక మత్స్య అభివృద్ధి మండలి ఏర్పాటు చేస్తున్నట్లు ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి శ్రీరాంసాగర్ వరకు 175 కిలోమీటర్ల పొడవున విస్తరించుకున్న గోదావరినదిపై నిర్మితమైన ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ ప్రత్యేక మత్స్య అభివృద్ధి మండలిగా ఏర్పాటు చేసేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఫలితంగా వేలాదిమంది మత్స్యకారులకు ఉపాధి, రూ.వేల కోట్ల మత్స్య సంపద సృష్టించేందుకు అవకాశాలు కలుగుతాయన్నారు. చేపలను స్థానికంగానే శుద్ధి చేసే ఫిష్ ప్రాసెసింగ్, వాల్యూ ఆడిషన్ పద్ధతులను అనుసరించడం ద్వారా ఇక్కడి చేపలను విదేశాలకు సైతం ఎగుమతి చేసేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల్లో కూడా చేపలను పెంచేందుకు ప్రయత్నాలు చేయనున్నట్లు వెల్లడించారు.

# రాష్ట్రం సంక్షేమ పథకాలకు నిలయం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- కోరుకంటి చందర్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

జ్యోతినగర్: తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలకు నిలయమని, సీఎం నాయకత్వంలో రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండంలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన రామగుండం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో మాట్లాడారు. రామగుండం నియోజకవర్గం ఉద్యమ సమయం నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి అండగా, ఒక శక్తిలా నిలిచిందన్నారు. పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. ఉద్యమ నాయకుడైన కోరుకంటి చందర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మంచి నాయకుడని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్‌పై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. ఐటీలో 4లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులు హైదరాబాద్ రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత మంత్రి కేటీఆర్‌దే అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, జెడ్పీటీసీ నారాయణ, నాయకులు కౌశిక హరి, కెంగర్ల మల్లయ్య, అడ్డాల రామస్వామి, పాముకుంట్ల భాస్కర్, జేవీ.రాజుతో పాటు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నదులను పరిరక్షించడానికే ఎస్టీపీలు**

రామగుండం: నదులను పరిరక్షించడం కోసమే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబజార్‌లో రూ.2.76 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో ఏర్పాటు చేసిన ఎస్టీపీని ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని ఇళ్లతో పాటు జెన్‌కో క్వార్టర్ల నుంచి వెలువడే వ్యర్థ జలాలు పాతబజార్‌లోని ఎస్టీపీలకు చేరుతుందని, ఇక్కడ ట్రీట్‌మెంట్ చేసి నీటిలోని వ్యర్థాలను తొలగించి శుద్ధి చేసిన జలాలను సమీపంలోని చెరువులు, కుంటలు, నదుల్లోకి వదలడం జరుగుతుందన్నారు. ఎస్టీపీ కేంద్రంలో 24 గంటల పాటు వాటర్ ట్రీట్‌మెంట్ చేస్తే ఒకరోజులో రెండు మిలియన్ లీటర్ల నీటిని (2ఎంఎల్‌డీ) శుద్ధి చేసే సామర్థ్యంలో మెషనరీ రూపొందించినట్లు తెలిపారు. అంతకుముందు రామగుండం బైపాస్ వద్ద మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్వాగతం పలికి బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో బైక్ ర్యాలీగా పాతబజార్‌లోని ఎస్టీపీ కేంద్రానికి చేరుకున్నారు.

**సంక్షేమ పథకాల్లో నంబర్ వన్**

గోదావరిఖని: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలుస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం తిలక్‌నగర్ విశ్వం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన రామగుండం ఆల్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిక**

పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి కొప్పుల ఈశ్వర్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తిలక్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమంగా నిలవడం అభినందనీయం



ఉత్తమ సర్పంచులను అభినందిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ఉత్తమ పంచాయతీ సర్పంచులకు అభినందన

పెద్దపల్లిరూరల్: స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్–2023లో జిల్లాకు చెందిన పంచాయతీలు రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలవడం అభినందనీయమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పెద్దపల్లి జిల్లాగా అవతరించిన తర్వాత రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది అవార్డులు సాధించిందని, అదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, మంథని మండలం నాగారం, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామాల సర్పంచులను అభినందించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటికో ఇంకుడుగుంత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీపీవో చంద్రమౌళి, ఎస్‌బీఎం రాఘవులు, సర్పంచులు వీరగోని సుజాత, మల్లేశ్, వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శులు వినోద్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

**ఆర్‌బీఐ క్విజ్ విజేతలకు నగదు పారితోషికం**

ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌బీఐ నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 60మంది విద్యార్థులకు రూ.1.50 లక్షల చెక్కులను కలెక్టర్ అందజేశారు. ఆర్థిక అంశాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకునేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

**ఈ–పాస్ తోనే ఎరువుల అమ్మకాలు**

ఎరువుల అమ్మకాలు ఈ–పాస్ యంత్రాల ద్వారానే జరపాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పెద్దపల్లిలోని జెండా ప్రాంతంలో గల పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఎరువుల కోసం వచ్చిన రైతులతో మాట్లాడి ఎరువుల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి ఉన్నారు.

**హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి**

పంటసాగుకు పొందిన రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తోందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు., రుణమాఫీపై ఏమైన సందేహాలుంటే కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నం .75699 42652కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్‌ను సందర్శించి రైతుల నుంచి ఏరకమైన వినతులు అందుతున్నాయని కలెక్టర్ ఆరా తీశారు. రుణమాఫీ పొందిన రైతులు బ్యాంకుల నుంచి కొత్త పంటరుణాలు పొందవచ్చన్నారు. కలెక్టర్ వెంట డీఏవో ఆదిరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం ఉన్నారు.

# ప్రశాంతంగా 'టెట్'



పరీక్షకు హాజరైన అభ్యర్థులు



హాల్‌టికెట్ నంబర్లు సరిచూసుకుంటూ..



తనిఖీలు చేసి పరీక్ష కేంద్రంలోకి ..



సమయం మించిపోవడంతో పరుగున వెళ్తున్న అభ్యర్థులు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన టెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షకు 78.93 శాతం, మధ్యాహ్నం పరీక్షకు 90.78శాతం హాజరయ్యారని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 11 పరీక్షా కేంద్రాల్లో 4,909 మంది అభ్యర్థులు టెట్ పరీక్ష రాసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉదయం 2,553 మంది హాజరు కావాల్సి ఉండగా 2,015 మంది, మధ్యాహ్నం 2,356కి 2,139 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని కలెక్టర్ అన్నారు. డీఈవో మాధవితో పాటు సంబంధిత అధికారులు పర్యవేక్షించారు.

## క్లుప్తంగా

### అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న వివేక్‌

ధర్మారం: బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్‌ అన్నారు. శుక్రవారం ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట, కానంపెల్లి గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేసి మాట్లాడారు. అధికార బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రజలకు చేసిన మోసాన్ని ప్రజలకు వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సూర్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌, నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యం, పెద్దపల్లి పార్లమెంట్‌ ఐటీ సెల్‌ ఇన్‌చార్జి సంపత్‌ పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబానికి పరామర్శ**

ధర్మారం మండల కేంద్రానికి చెందిన బొమ్మగాని శ్రీనివాస్‌ అనారోగ్యంతో మరణించగా కుటుంబసభ్యులను శుక్రవారం బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు మాజీ ఎంపీ వివేక్‌ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### 'ఆయుష్మాన్‌ భవ'పై అవగాహన పెంచుకోవాలి

పెద్దపల్లిరూరల్‌: ఆయుష్మాన్‌ భవ కార్యక్రమం అమలు తీరుపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ ప్రమోద్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో పెద్దపల్లి, గర్రెపల్లిలోని 242 మంది ఆశాలకు నిర్వహించిన శిక్షణలో పాల్గొని పలు సూచనలిచ్చారు. శిక్షణ పొందిన ఆశాలు శనివారం నుంచి అక్టోబర్‌ 2వరకు గ్రామ, వార్డుల్లో సేవా పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రోగ్రామ్‌ అధికారి కేవీ సుధాకర్‌రెడ్డి, పి.మధుకర్‌రెడ్డి,డీపీహెచ్‌ఎన్‌వో డోరకమ్మ పాల్గొన్నారు.

### వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ఫెర్టిలైజర్‌సిటీ: వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు విద్యుత్‌ శాఖ అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్‌ అన్నారు. విద్యుత్‌ కనెక్షన్‌ కోసం స్థానిక ఏఈ కార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. మండపాల్లో వి ద్యుత్‌ వినియోగం 1కేవీకి రూ.1,560, 1.5కేవీకి రూ.2,300, 1.5కేవీ నుంచి 2కేవీకి రూ. 3,020 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్‌ డి. సత్యనారాయణరావు


నివాళి అర్పిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్‌


మాట్లాడుతున్న సింగరేణి ఈఅండ్‌ఎండీ సత్యనారాయణరావు

రామగిరి: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను యువత ఆదర్శంగా తీసకొని ముందుకు సాగాలని సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్‌ డి. సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జేఎన్టీయూ కళాశాలలో ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీర్స్‌ సింగరేణి చాప్టర్‌ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇంజినీర్స్‌ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భావితరాలకు చక్కటి వాతావరణం, సౌకర్యాలు అందించేది ఒక్క ఇంజినీర్స్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. జీ20 దేశాల శిఖరాగ్ర సమావేశాల్లో గ్రీనరీపై పెద్ద ఎత్తున తీర్మాణాలు జరిగాయని, అలాంటి గ్రీనరీలో సింగరేణి భాగస్వామ్యం కావడం ఆనంద దాయకమని తెలిపారు. ఇంజినీరింగ్‌ లేని ప్రపంచం లేదనే విషయాన్ని గుర్తించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్‌ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఆర్జీ–1, 2 జీఎంలు చింతం శ్రీనివాస్‌, ఎల్‌వీ సూర్యనారాయణ, రక్షణ రీజియన్‌ జీఎం సాంబయ్య, బస్వీరెడ్డి, జేసురత్నం, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆర్జీ–3 డివిజన్‌లో..**

ఆర్జీ–3 డివిజన్‌లో నిర్వహించిన ఇంజినీర్స్‌ డే వేడుకల్లో జీఎం సుధాకర్‌రావు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు ఎనలేనవని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఏరియా ఇంజినీర్లు ఏలీషా, సీతారామం, ఎస్‌వోటూజీఎంలు రఘుపతి, భైద్య, ఫైనాన్స్‌ ఏజీఎం పి.శ్రీనివాసులు, పర్సనల్‌ మేనేజర్‌ రవీందర్‌రెడ్డి, ఎస్‌ఎస్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**ఇంజినీర్లకు సన్మానం**

సివిల్‌ ఇంజినీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు మరువలేనివని టీబీజీకేఎస్‌ జనరల్‌ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. లయన్స్‌ క్లబ్‌ అధ్వర్యంలో జీఎం సుధాకర్‌రావు సివిల్‌ ఇంజనీర్లను సన్మానించిగా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం గర్వించదగ్గ ఇంజినీర్‌ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని అన్నారు. సివిల్‌ డీవైజీఎం పద్మరాజు, లయన్స్‌ క్లబ్‌ సభ్యులు ముల్మారి శ్రీనివాస్‌, గంట వెంకటరమణారెడ్డి, మేకల శరణ్య యాదవ్‌, సదారెడ్డి, తొట్ల రాజు, సివిల్‌ అధికారులు పాల్గొన్నారు.

**విశ్వేశ్వరయ్య మార్గంలో పయనించాలి**

గోదావరిఖని: ప్రముఖ సివిల్‌ ఇంజినీర్‌ సర్‌ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గంలో ఇంజినీర్లు పయనించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఇంజినీరింగ్‌ డే వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్య నిరాడంబరత, భారతజాతి అభివృద్ధికి చూపిన అంకితభావంతో భారతరత్న బిరుదు లభించిందన్నారు. రీజియన్‌ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏరియా ఇంజినీర్‌ రాంమూర్తి, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో..**

గోదావరిఖని: ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో ఇంజినీరింగ్‌ డే నిర్వహించారు. విశ్వేశ్వర్వయ్య చిత్రపటానికి ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. క్రమశిక్షణ, నిబద్ధత, మేధస్సుతో ఇంజినీరింగ్‌లో ఎన్నో అద్భుతాలు సృష్టించి చరిత్రలో నిలిచిపోయారని, ఆయన సేవలు ఎక్కువగా మైసూర్‌ రాష్ట్రానికి అందించినప్పటికీ తెలుగునాట కూడా గొప్ప ప్రతిష్టాత్మకమైన ఇంజినీరింగ్‌ నిర్మాణాలకు తన సహాయాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, సివిల్‌ డీజీఎం ధనుంజయ, వర్క్‌షాప్‌ డీజీఎం ఎర్రన్న, పర్సనల్‌ డీజీఎం రాజేంద్రప్రసాద్‌, ఐఈడీ డీజీఎం మురళీ కృష్ణ, పాల్గొన్నారు.

### సాహితీవేత్తల రచనలతో సార్థకత

గోదావరిఖనిటౌన్‌: సాహితీవేత్తలు రాసిన రచనలు ప్రజల్లోకి వెళ్లినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందని ప్రముఖ కవి నిధి(బ్రహ్మచారి) అన్నారు. స్నేహ సాహితీ గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‹అమరవాణి› పుస్తక ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రముఖ కవి రాకుమార రచించిన అమరవాణి పుస్తకం అద్భుతమైన రచన అని కొనియాడారు. కవి వీరస్వామి మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న శ్లోకాలను ఎంచుకొని చక్కని తెలుగులో పద్యాలుగా రాసారని, సరళమైన భాషలో ప్రతిఒక్కరూ చదివి అర్థం చేసుకునే విధంగా ఉన్నాయన్నారు. అనంతరం కవి రాకుమారను కవులు ఘనంగా సన్మానించారు. అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఏలేశ్వరం వెంకటేష్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరసం జాతీయ కార్యదర్శి నారాయణ, కవులు, కళాకారులు చంద్రప్రకాశ్‌గుప్త, సలాం, రాజయ్య, మ్యాజిక్‌ రాజా, లెనిన్‌ పాల్గొన్నారు.

# ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు

ముత్తారం: విద్యుత్‌ సమస్యలపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ వరంగల్‌ చైర్‌పర్సన్‌ ఎన్‌వీ వేణుగోపాలచారి అన్నారు. శుక్రవారం ముత్తారంలో నిర్వహించిన విద్యుత్‌ వినియోగదారుల ఫోరం అవగాహన సదస్సులో మాట్లాడారు. సమస్యలపై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడల్లా రశీదు పొందాలన్నారు. పరిష్కారం కానప్పుడు లిఖితపూర్వకంగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో పేరుకపోయిన విద్యుత్‌ సమస్యల పరిష్కారంలో ట్రాన్స్‌కో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అవగాహన సదస్సు ఉన్నట్లు సమాచారం ఇవ్వలేదన్నారు. లోవోల్టేజీ సమస్య, భారీ వర్షాలతో మానేరు పరివాహక ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు దెబ్బతిన్న సమయంలో మరమ్మతుల్లో జాప్యం జరుగుతోందని పలువురు విన్నవించారు. ట్రాన్స్‌కో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని వేణుగోపాలచారి సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌ టెక్నికల్‌ మెంబర్‌ కె.తిరుమల్‌రావు, ఫైనాన్స్‌ మెంబర్‌ ఆర్‌.చరణ్‌దాస్‌, ఇండిపెండెంట్‌ మెంబర్‌ నరేందర్‌, ఎస్‌ఈ సుదర్శన్‌, డీఈఈ శివరాము, ఏడీఏ విజయ్‌గోపాల్‌, ముత్తారం, మంథని, కమాన్‌పూర్‌, ఎగ్లాస్‌పూర్‌ ఏఈలు హన్‌మాన్‌దాస్‌, మల్లయ్య, రాజేంద్రకుమార్‌, శ్రీనివాస్‌, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేణుగోపాలచారి

## ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి


వినతిపత్రం ఇస్తున్న మక్కాన్‌సింగ్‌ ఠాకూర్‌

రామగుండం: రామగుండం కార్పొరేషన్‌ ఒకటో డివిజన్‌ హౌసింగ్‌బోర్డు కాలనీలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ ఠాకూర్‌ అన్నారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి రామగుండం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్‌ మాట్లాడుతూ 1984లో గోదావరి ముంపు బాధితుల పునరావాసం కోసం హౌసింగ్‌ బోర్డు కాలనీలోని సర్వే నం.322లో ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఈనేపథ్యంలో కాలనీవాసులకు దసరా, వినాయక నవరాత్రి ఉత్సవాలు, శుభకార్యాలు, ఇతరాత్ర పలు ప్రయోజనాలకు వినియోగించుకునే స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నట్లు కాలనీవాసులు తమ దృష్టికి తీసుకరావడంతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి అన్యాక్రాంతమవుతున్న స్థలాన్ని పరిరక్షించాలని కోరినట్లు తెలిపారు. తహసీల్దార్‌ నుంచి స్పందన రాకుంటే కలెక్టర్‌కు విన్నవించి ప్రజల మద్దతుతో స్థలాలను పరిరక్షించుకుంటామని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్పొరేటర్‌ ముదాం శ్రీనివాస్‌, మత్స్యశాఖ నియోజకవర్గ చైర్మన్‌ పల్లికొండ రాజేశ్‌, కాంగ్రెస్‌ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్‌, ఈదునూరి హరిప్రసాద్‌, శ్రీనివాస్‌, బొద్దుల శంకర్‌, నరేశ్‌, మల్లయ్య, ధర్మాజి శంకర్‌ తదితరులున్నారు.

**కాంగ్రెస్‌ పార్టీతోనే పేదప్రజలకు న్యాయం**

పాలకుర్తి: కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో 500 మంది కాంగ్రెస్‌ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు మహేష్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జీపీ కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలి

పెద్దపల్లిరూరల్‌: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలు చేపట్టేందుకు కార్మికులు సన్నద్ధ కావాలని వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు ముత్యంరావు అన్నారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. సమస్యల పరిష్కారానికి అక్టోబర్‌ 2 నుంచి నిరవధిక సమ్మె చేయాలని రాష్ట్ర జేఏసీ నిర్ణయించిందన్నారు. ఈనెల 20, 21న మండల కేంద్రాల్లో ధర్నాలతో మొదలుపెట్టి 27న జిల్లా కేంద్రంలో ధర్నాలు నిర్వహించే వరకు పోరాటాలు సాగుతాయన్నారు. అక్టోబర్‌ 2 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు.

### 20 నుంచి ఐటీఐలో స్పాట్‌ అడ్మిషన్లు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలోని ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సీట్లను కేటాయింపునకు ఈనెల 20 నుంచి 23 వరకు స్పాట్‌ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌ నర్సింహాచారి తెలిపారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలన్నారు.

### రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ఓటమి ఖాయం

జ్యోతినగర్‌: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ఓటమి ఖాయమని, అధికారంలోకి రానున్నది కాంగ్రెస్‌ ప్రభుత్వమని ఆల్‌ ఇండియా ఐఎన్టీయూసీ ఎన్టీపీసీ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జాతీయ ఉపాధ్యక్షుడు బండారి కనకయ్య అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానాలు నిలిపివేసే క్రమంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంను ప్రకటించడంలో ఆమె తెలంగాణ తల్లిగా నిలిచిందన్నారు. ఈనెల 17న మహేశ్వరం నియోజవర్గం పరిధిలోని తుక్కుగూడలో రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరుగనున్న విజయభేరి సభకు భారీ జనాన్ని తరలించేందుకు సమీకరణలు చేపట్టామని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నానని ప్రకటించారు. ఈ సమావేశంలో ఐఎన్టీపీసీ నాయకులు భూమల్ల చందర్‌ పాల్గొన్నారు.

### ఎన్టీపీసీ ఉద్యోగులుగా 17 మంది భూ నిర్వాసితులు

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం సంస్థ ఉద్యోగులుగా 17 మంది భూనిర్వాసితులు ఉద్యోగంలో చేరేందుకు శుక్రవారం ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 1న 17 మంది భూనిర్వాసితుల ఉద్యోగ నియామక జాబితాను సంస్థ విడుదల చేసింది. గతేడాది ఏప్రిల్‌ 22న నిర్వహించిన రాత పరీక్షలకు 47 మంది అర్హత పొందగా 216 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిసింది. అయితే ఇందులో 25 మందిని ఎంపిక చేసి జాబితాను 2022 మేలో విడుదల చేశారు. కొన్ని కారణాలతో కోర్టులో ఫిర్యాదు చేయడంతో జాబితాను నిలుపుదల చేశారు. హైకోర్టులో నిబంధనలకు లోబడి 17 మంది జాబితాను విడుదల చేశారు. మిగిలిన 8 మంది అభ్యర్థులకు సంబంధించిన ఆధారాల ధ్రువీకరణ ప్రక్రియలో ఉన్నందున వాటి వివరాలు నిర్ణీత సమయంలో తెలియజేయన్నుట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 17 మందికి సంబంధించిన మెడికల్‌ పరీక్షలు వారం రోజుల క్రితం ధన్వంతరి ఆస్పత్రిలో పూర్తయ్యాయి. 15వ తేదీ నుంచి 21వ తేదీలోగా ఉద్యోగంలో చేరేందుకు గడువును యాజమాన్యం తెలిపింది. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న భూనిర్వాసితులు ఉద్యోగ నియామకం కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## బొగ్గుబాయి వార్తలు

# కార్మికుల జీతాల జోలికొస్తే అంతుచూస్తాం

- వచ్చేనెల 5,6,7 తేదీల్లో సింగరేణిలో సమ్మె
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: కార్మికుల జీతాల జోలికొస్తే అధికారుల అంతుచూస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులకన్నా కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటూ కోల్‌మైన్స్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌(సీఎంఓఏఐ) జబల్‌పూర్‌ కోర్టులో కేసు వేసిందన్నారు. దీని వల్ల కార్మికుల 11వ వేతన జీతాల్లో కార్మికులకు ఇబ్బంది కలిగితే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అధికారులకు పదేళ్లకోసారి వేతన ఒప్పందం ఒప్పంద గడువు ఉండటం వల్ల జరిగే తప్పిదానికి కార్మికులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. కోర్టు ద్వారా కా ర్మికులకు నష్టం జరిగితే కార్మికుల నుంచి తిరుగుబాటు తప్పదని తెలిపారు. అధికారుల వేతనాలు పెంచడం విషయంలో తాము వ్యతిరేకంగా కాదన్నారు.

**వచ్చే నెల 5,6,7తేదీల్లో సమ్మె**

అధికారుల సంఘం వైఖరిని వ్యతిరేకిస్తూ కోలిండియా వ్యాప్తంగా వచ్చే నెల మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చామని సీతారామయ్య అన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి సమ్మెను విజయవంతం చేయాలన్నారు. పెరిగిన జీతాలను ఆపే ప్రయత్నం చేస్తే తిరుగుబాటుకు వెనకాడేది లేదన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌, నాయకులు వైవీరావు, సమ్మయ్య,ప్రకాశ్‌, రాజరత్నం, క్రిష్టఫర్‌, రంగు శ్రీనివాస్‌, ప్రభుదాస్‌, తిరుపతి, శంకరయ్య పాల్గొన్నారు.

# క్రీడలకు సింగరేణి ప్రోత్సాహం


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌

రామగిరి: సింగరేణి సంస్థ క్రీడలను ప్రోత్సహిస్తోందని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆర్జీ–3, ఏపీఏ ఏరియా వార్షిక క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్మికుల సంక్షేమంలో భాగంగా సంస్థ క్రీడల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని క్రీడాస్ఫూర్తితో పాల్గొని కోల్‌ ఇండియాస్థాయిలో సింగరేణి కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. అనంతరం ఆయా క్రీడల కెప్టెన్‌లతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎంలు రఘుపతి, భైద్య, ఓసీపీ–1,2 పీవోలు రాధాకృష్ణ, రాజేందర్‌, పర్సనల్‌ మేనేజర్‌ రవీందర్‌, యూనియన్‌ ప్రతినిధులు గౌతం శంకరయ్య, ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్‌, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు ఐఎన్టీయూసీ అండ

- ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్‌ కార్యదర్శి బాబర్‌ సలీంపాషా


మాట్లాడుతున్న బాబర్‌ సలీంపాషా

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు ఐఎన్టీయూసీ అండగా ఉంటుందని యూనియన్‌ జాతీయ సీనియర్‌ కార్యదర్శి బాబర్‌ సలీంపాషా అన్నారు. శుక్రవారం ప్రాజెక్టు లేబర్‌ గేట్‌ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు మెరుగైన అలవెన్సులను యాజమాన్యంతో మాట్లాడి ఇప్పించడంలో ఐఎన్టీయూసీ పాత్ర ఎంతో ఉందని అన్నారు. కార్మిక సంఘాల ఐక్యతతోనే కార్మికులకు హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. రామగుండం ప్రాంతంలోని కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు తోటి సంఘాలను కలుపుకుని యాజమాన్యంతో చర్చించనున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టులోని కార్మికులకు పాత పద్ధతిలోనే గేట్‌పాస్‌లు జారీ అయ్యేలా మాట్లాడనున్నట్లు హామీ ఇచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు ఫలవంతమయ్యాయని, కార్మికులకు చెల్లించాల్సిన ఏరియర్స్‌ను దసరా పండుగకు ముందు చెల్లించాలని సూచించారు. 60 ఏళ్ల వయస్సు ఉద్యోగ విరమణపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక సబ్సిడీ క్యాంటిన్‌ సౌకర్యం కల్పించాలని అన్నారు. రామగుండం రీజియన్‌ కాంట్రాక్టు వర్కర్స్‌ అండ్‌ కన్‌స్ట్రక్షన్‌ లేబర్‌ యూనియన్‌(ఐఎన్టీయూసీ) ప్రధాన కార్యదర్శి భూమల్ల చందర్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగ గుర్తింపు సంఘం అడిషనల్‌ జనరల్‌ సెక్రెటరి కందుల స్వామి, జమీల్‌, ఇజ్జగిరి భూమయ్య, పూసాల శ్రీనివాస్‌, మేకల కొమురయ్య, నాగభూషణం, శ్రీనివాస్‌, సత్యనారాయణ, గణపతితో పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ప్రాజెక్టు అధికారితో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

గోదావరిఖని: ఓసీపీ–3 ఎస్‌అండ్‌డీ, బేస్‌ వర్క్‌షాప్‌ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌ కోరారు. శుక్రవారం అధికారులతో సమావేశమై సమస్యల గురించి చర్చించారు. ఎస్‌అండ్‌పి, బేస్‌వర్క్‌షాప్‌కు సంబంధించిన నూతన షెడ్లు నిర్మించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వెంటనే వాహనాల పార్కింగ్‌ షెడ్లు నిర్మించాలని, బేస్‌వర్క్‌షాప్‌లో ఆర్వో ప్లాంట్‌ ఏర్పాటు చేయాలని కోరారు. ఓసీపీ–3లో క్యాంటీన్‌ మ్యాన్‌పవర్‌ లేక ఇబ్బందులకు గురవుతున్న దృష్ట్యా మ్యాన్‌పవర్‌ పెంచాలన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు ఏజెంట్‌ మధుసూదన్‌, మేనేజర్‌ రమేశ్‌, యూనియన్‌ నాయకులు కొంగర రవీందర్‌, రవీందర్‌రెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

## మృత్యువుతో పోరాడి ఓడిన అముద

### క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

**అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'**

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

## మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

# ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహాసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

# అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

## మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్**

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూప్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

# టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చొబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

**టీచర్ల భర్తీ తర్వాతే...**

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

# విద్యతోనే సామాజిక న్యాయం

- సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి
- యూనివర్సిటీ సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు రాక


నారాయణమూర్తిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: విద్యతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. మంచిర్యాల జిల్లా సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం నారాయణమూర్తిని సన్మానించారు. అనంతరం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన యూనివర్సిటీ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో నారాయణమూర్తి మాట్లాడారు. తాను నటించి, నిర్మించి, దర్శకత్వం, సంగీతం వహించిన యూనివర్సిటీ సినిమా అక్టోబర్ 13న విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు వచ్చానని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన, జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీ ఇతివృత్తంగా యూనివర్శిటీ సినిమా రూపొందించామని చెప్పారు. విద్యారంగంలో పేపర్ లీకేజీ అనేది భారత దేశంలో పెను ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని తెలంగాణ, ఏపీ, గుజరాత్, అసోం, ఎంపీ, బీహార్, యూపీ రాష్ట్రాలలో పేపర్ లీకేజీలు జరిగాయని వివరించారు. విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అయితే మొత్తం వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత స్వయం ప్రతిపత్తి కలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ఉందని తెలిపారు. విద్య జాతీయ సంపద అని దానిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. సినిమా బాగుంటే చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని, దానికి ఉదాహరణ బేబీ సినిమానే అని అన్నారు. జీతం జీవితం రెండూ ఇంగ్లిష్ బాషపైనే ఆధార పడి ఉన్నాయని, నేటి సమాజంలో ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యతను ఈ సినిమాలో బలంగా చూపించామని తెలిపారు. పండుగల సెలవులు, పబ్లిక్ హాలిడేస్‌లో థియేటర్లలో చిన్న సినిమాల ప్రదర్శనకు ఉదయం ఆటను చిన్న సినిమాలకు కేటాయించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరామని తెలిపారు. నా సినిమా ప్రదర్శనకు సహకరించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. తన సినిమాకు ప్రజాయుద్ధనౌక గద్దర్‌తోపాటు తెలంగాణ కళాకారులు పాటలు అందించారని వెల్లడించారు. యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని కోరారు.

## ఎన్నికల బరిలో ఉంటా.. ఆశీర్వదించండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


కన్నీరు పెట్టుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుంచే తాను బరిలో ఉంటానని ఎమ్మెల్యే రేఖానాయక్ స్పష్టం చేశారు. మీ ఆశీస్సులు కావాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. చింతగూడ లక్ష్మీదేవి ఆలయంలో పూజలు చేశారు. అక్కడే ఓ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. రెండుసార్లు ఆశీర్వదించినట్లుగానే వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. 12 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ఈసారి టికెట్ ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేను ఓదార్చారు. తర్వాత ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సీపతి రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి జన్నారం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. మంజూరైన అభివృద్ధి పనులు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు జరిగితే తనకు పేరు వస్తుందని ఆరు నెలలుగా కొంతమంది పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని తెలిపారు. అనంతరం చింతలపల్లి గ్రామానికి వెళ్లి ప్రజలతో కలిసి మాట్లాడారు. అక్కడ గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌కుమార్, కాంతమణి తదితరులు ఉన్నారు.

**నృత్యకారులకు సన్మానం..**

జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు గాజుల సహస్రగౌడ్, శ్రేణు, సంకర్ష్, వర్షిణి, తన్విక, అశ్విత, మోక్షితలను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమానికి రేఖానాయక్ హాజరైన మాట్లాడారు. జాతీయస్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి 18 మంది ఎంపిక కాగా, అందులో 8 మంది జన్నారం మండలానికి చెందినవారే కావడం గర్వకారణమన్నారు. చిన్నారుల్లోని కళలను వెలికితీసి, వారి ప్రతిభ జాతీయ స్థాయిలో చూపిస్తున్న మాస్టర్లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, డ్యాన్స్ మాస్టర్లు లక్ష్మణ్, రమేశ్, నర్మదగౌడ్, నాయకులు సతీశ్‌కుమార్, కాంతామణి పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి


కార్యక్రమంలో వీసీ, డైరెక్టర్, కంపెనీల ప్రతినిధులు

భైంసా: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం వర్సిటీలో కాకతీయ శాండ్‌బాక్స్, దేశ్‌పాండే ఫౌండేషన్, గ్రాడ్ క్యాపిటల్ వ్యవస్థాపకులతో వ్యవస్థాపక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌పై 'యువ' ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజురెడ్డి, కాకతీయ శాండ్‌బాక్స్ సీఈవో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల కోసం 'వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ'లో మూడు నెలల నాన్ క్రెడిట్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉన్నట్లుగానే ప్రతీ పనికి ఒక నూతన ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు సాంకేతికంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ ఎట్ ఆర్జీయూకేటీ అధ్వర్యంలో రాకేశ్‌రెడ్డి కోఆర్డినేటర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే..**

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్, వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మోక్షగుండంవిశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ శాంతి జగదీశ్వరి, అధ్యాపకులు కలీల్, వహీద్, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఎస్సీ 'అగ్రి' ప్రవేశాలు షురూ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మంజూరైన బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 11 నుంచి తొలివిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఏడుగురు విద్యార్థులు ఆదిలాబాద్ కళాశాలలో సీట్లు పొందినట్లుగా కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్ తెలిపారు. శనివారంతో తొలివిడత ముగియనుండగా మరికొంత మంది ప్రవేశాలు పొందే అవకాశముందని పేర్కొన్నారు. రాంనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రం భవనాల్లో ప్రారంభించనున్న ఈ కళాశాలకు ప్రభుత్వం 60 సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కాని పక్షంలో రెండు, మూడో విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని డీన్ పేర్కొన్నారు.

# అధికారులు వర్సెస్ కార్మికులు

- దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల్లో ఆందోళన
- సీఎంవోఏఐ కోర్టుకెక్కడంతో కార్మిక సంఘాల ఆగ్రహం
- అధికారుల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు
- సమ్మెకు పిలుపునిచ్చిన జాతీయ కార్మిక సంఘాలు


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మికులకు ఆగ్రహం తెప్పిస్తోంది. మా జీతాలు పెరిగితే వాళ్లకేమి కళ్లమంట అంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం వర్సెస్ కార్మిక సంఘంగా మారుతోంది. విభేదాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రోజుల సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 11వ వేతన ఒప్పందం అమలు కావడంతో కోలిండియా వ్యాప్తంగా ఉన్న సింగరేణి, బీసీసీఎల్, ఎస్‌సీఎల్, మహానది కోల్‌ఫీల్డ్స్, ఎస్ఈసీఎల్, డబ్లుసీఎల్, ఈసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న మూడున్నర లక్షల మందికి పెరిగిన వేతనాలు అమలువుతున్నాయి. ఈసమయంతో అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మిక సంఘాలకు ఆగ్రహం తెప్పిస్తోంది. తమకు వేతనాలు పెరగాలని పోరాడాలే తప్ప కార్మికుల వేతనాలు ఎందుకు పెరిగాయని వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. అధికారుల వేతన ఒప్పందం పదేళ్లకోసారి, కార్మికుల వేతన ఒప్పందం ఐదేళ్లకోసారి జరుగుతుంది. ఈసమయంలో వేతనాల పెరుగుదల అవకాశం ఉంటుంది. ఈక్రమంలో రెండు నెలల కిందట జరిగిన వేతన ఒప్పందంలో కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ–4 నుండి కింది స్థాయి అధికారులకన్నా కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అయితే పదేళ్లకోసారి మాత్రమే పెంచేందుకు అవకాశం ఉండటంతో చేసేదేమి లేక కార్మికుల వేతనాలను ఎక్కువగా ఉన్నాయని అధికారులు కోర్టుకెక్కడం హాస్యాస్పదం అంటున్నారు.

**వేతనాలపై ప్రభావం చూపితే ఊరుకోం..**

తాము యాజమాన్యంతో పోరాడి 11వ, వేతన ఒప్పందం సాధించుకున్నామన్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం కోర్టుకెక్కడంతో కార్మికుల వేతనాలు నిలిచిపోతే ఊరుకునేది లేదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. అధికారులు పోరాడి వేతనాలు పెంచుకోవాలే తప్ప కార్మిక వేతనాలపై కోర్టుకెక్కడం సరికాదంటున్నారు. ఈక్రమంలో కార్మికుల వేతనాలపై ప్రభావం చూపితే అధికారులపై తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

**వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మె**

అధికారుల తీరును నిరసిస్తూ కోలిండియా వ్యాప్తంగా వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు కోలిండియా స్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటించాయి. తాము పోరాడి సాధించుకున్న వేతనాలపై ప్రభావం చూపితే అధికారుల అంతుచూస్తామని హెచ్చరిస్తున్నాయి. ఈవిషయంలో అధికారులు పునరాలోచించుకుని ఇన్నేళ్ల పాటు అధికారులు, కార్మికుల మధ్య ఉన్న సత్సంబంధాలు కొనసాగించాలంటున్నారు.

**ఇక అధికారులపై పోరాటమే..**



కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం(సీఎంఓఏఐ) జబల్‌పూర్ హైకోర్టులో పిటిషన్ వేసింది. రెండు నెలలుగా 11వ వేతన ఒప్పందం ప్రకారం కార్మికుల జీతాలు పెరిగాయి. ఈక్రమంలో అధికారులు కోర్టుకెక్కడం వల్ల కార్మికుల పెరిగిన జీతాలు ఆగితే ఊరుకోం. ఇంత ఎంత మాత్రం సమంజసం కాదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు

**సమ్మెను విజయవంతం చేయాలి**



కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇదే వైఖరితో ముందుకు సాగితే ఇరువురి మధ్య అంతరం పెరుగుతుంది. ఇన్నేళ్ల పాటు కొనసాగిన సత్సంబంధాలు దెబ్బతింటాయి. అధికారులు వేతనాలు పెంచుకుంటే తమకేమి ఇబ్బంది కాబోదు. పెరిగిన వేతనాలు ఆగితే ఊరుకోబోం.

– యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

# మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

- భూపాలపల్లిలో అంతర్ రాష్ట్ర పోలీసుల సమావేశం
- దిశా నిర్దేశం చేసిన సీపీ రెమా రాజేశ్వరి


సమావేశంలో సీపీ రెమా రాజేశ్వరి, ఎస్పీలు

గోదావరిఖని: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర పోలీసు అధికారులు నిర్ణయించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జెన్‌కో కాన్ఫరెన్స్ హాల్‌లో భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షతన వహించిన రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. దీని ద్వారా ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని తెలిపారు. రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేయటంతో పాటు మద్యం, డబ్బు ఇతర ఇల్లీగల్‌కు సంబంధించి అక్రమ రవాణా అడ్డుకట్ట పడుతుందన్నారు. సరిహద్దు గుండా అక్రమ మద్యం, మహారాష్ట్ర దేశీదారు, గంజాయి మొదలైన వాటి రవాణా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేశ్‌కుమార్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్, మంచిర్యాల్ డీసీపీ సుధీర్‌కేకన్, ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.